# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 27, మే 2026




## వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**హాజీపూర్, మే 26, ప్రభాతవార్త**

రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్, శ్రీ సాయి మణికంఠ రైస్ మిల్ లను మండల తహసీల్దార్ పుష్పలతతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**కెరమెరి, మే 26, ప్రభాతవార్త:**



జూన్ 1న కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొలం కొఠారి గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నందున, అందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కెరమెరి మండలం కోలం కొఠారి గ్రామాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. దాస్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావు, రాష్ట్ర ఇంజనీరింగ్ ముఖ్య అధికారులు మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ పనులను త్వరితగతిన, సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత నిర్మాణాలను, మురికి కాలువల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే సీసీ రహదారి ఇరువైపులా ముగ్గులు వేయాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహాలను చక్కగా అలంకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల ముందు పరిసరాలు చాలా శుభ్రంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున, అందుకోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా, సభకు విచ్చేసే ప్రజలకు మరియు లబ్ధిదారులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల షామియానాలు, కుర్చీలు సిద్ధం చేసి ఉంచాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సభ ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా, ప్రతీ ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఏర్పాట్లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికార డిపిఓ భిక్షపతి, పీడీ ప్రకాష్ రాజు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా అటవీ శాఖలో బదిలీ ప్రక్రియ

**ఆసిఫాబాద్, మే 26, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల ప్రక్రియకు ఈనెల 31 వరకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో జిల్లా అటవీ శాఖలో జిల్లాస్థాయి పోస్టులైన బీట్ అధికారులకు జిల్లా కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారిని బాలామణి, ఎఫ్డిఓ అప్పయ్య, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్డిఓ వేణుబాబుతో కలిసి బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల ప్రకారం జిల్లాలో రెండు డివిజన్ లలో కలిపి మొత్తం 45 మంది బీట్ అధికారులు బదిలీకి అర్హత సాధించారని తెలిపారు. వీరికి గాను 11 రేంజిలలో 45 బీట్లను కేటాయించామని, వారు ప్రస్తుతం పని చేస్తున్న బీట్ సర్వీస్ లో వచ్చిన మార్కుల ఆధారంగా ర్యాంకులు కేటాయించి బదిలీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. పారదర్శకంగా బదిలీ ప్రక్రియ నిర్వహించడంతోపాటు అటవీ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. అంతకుముందు యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించి వారి సూచనలు సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్ కులకర్ణి తోపాటు సభ్యులు సాయిచరణ్, సద్దాం, స్వప్న, అనిల్, మోహన్, శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.



## ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం వద్దు, రైతులకు ఇబ్బంది కలగొద్దు

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిర్మల్, మే 26, ప్రభాతవార్త:**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గోదాముల్లో అన్‌లోడింగ్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్ష్మణచందా మండలం తిరుపల్లి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ గోదామును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ట్రాక్టర్ల ద్వారా రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. గోదాం ఆవరణలో బారులు తీరిన ట్రాక్టర్లను చూసి, అన్‌లోడింగ్‌లో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోదాం మొత్తం నిల్వ సామర్థ్యం ఎంత, ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం నిల్వ చేశారు, రోజుకు సగటున ఎన్ని ట్రాక్టర్లు వస్తున్నాయి, అన్‌లోడింగ్ కోసం ఎన్ని గంటలు వేచి ఉండాల్సి వస్తోంది అనే వివరాలను రికార్డులతో సరిచూశారు. ప్రస్తుతం షిఫ్ట్‌కు ఎంత మంది హమాలీలు పనిచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎండలో గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. అన్‌లోడింగ్ వేగం పెంచేందుకు అవసరమైతే అదనపు హమాలీలను వెంటనే నియమించుకోవాలని, రాత్రి వేళ కూడా అన్‌లోడింగ్ కొనసాగించేలా షిఫ్టుల పద్ధతిని అమలు చేయాలని ఆదేశించారు. గోదాం వద్ద రైతులకు, హమాలీలకు తాగునీరు, నీడ, మరుగుదొడ్ల సౌకర్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. తహసీల్దార్, పౌరసరఫరాల అధికారులు రోజూ గోదాములను సందర్శించి పరిస్థితిని సమీక్షి ంచాలని సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరకు రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు చేర్చిన తర్వాత అన్‌లోడింగ్‌లో జాప్యం జరిగితే రైతులకు నష్టమని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ఒక్క ట్రాక్టర్ కూడా ఆగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డీఎంసీఎస్ సుధాకర్, లక్ష్మణచందా తహసీల్దార్ సరిత, మార్కెటింగ్ శాఖ ఏడీ, గోదాం మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటికే 70 శాతం పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్‌ను వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ గడువు విధించారు.

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

**కాగజ్‌నగర్, మే 26 ప్రభాతవార్త:**



కాగజ్‌నగర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో ఉన్న ఎరువుల నిల్వలు, మెషిన్‌లో నమోదైన వివరాలు, ఫర్టిలైజర్ యాప్‌లోని స్టాక్ వివరాలు సమానంగా ఉండేలా చూసుకోవాలని డీలర్లకు సూచించారు. యూరియాను అధిక ధరలకు విక్రయించినా, లింక్ ప్రొడక్ట్స్‌తో రైతులకు బలవంతంగా అమ్మకాలు నిర్వహించినా సంబంధిత డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఫర్టిలైజర్ యాప్‌కు సంబంధించిన సందేహాలను రైతులకు నివృత్తి చేశారు. ఎరువుల బుకింగ్ విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు, ఏఓలను సంప్రదించాలని సూచించారు. ఎరువుల బుకింగ్ కోసం మొబైల్ నంబర్ లింక్ లేకపోతే వెంటనే సంబంధిత ఏఈఓ వద్ద అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం కాగజ్‌నగర్ మండలంలో 594.38 టన్నుల ఎరువుల నిల్వ అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి రామకృష్ణ వెల్లడించారు.

# స్మశాన వాటికలో తీరానున్న నీటి కష్టాలు

**కెరమెరి, మే 26, ప్రభాత వార్త :**



కెరమెరి గ్రామపంచాయతీలోని స్మశాన వాటికలో అంత్య క్రియలు నిర్వహించే సమయంలో ప్రజలకు నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది ఎదురయ్యేది. కాగా ఇట్టి సమస్యను గమనించిన సర్పంచ్ పెందోర్ ఆనందరావు స్మశాన వాటికలో చాలా సంవత్సరాల క్రితం వేసి ఉన్న బోరుబావిని ఉప సర్పంచ్ శ్రీకాంత్ తో కలిసి పరిశీలించి వినియోగంలోకి తీసుకొని రావాలని దృష్టి సారించి చర్యలు చేపట్టారు. మంగళవారం బోరుబావిలో నూతన చేతి పంపును ఏర్పాటు చేసి నీటి సౌకర్యాని కల్పించారు. దీంతో నీటి కష్టాలు తీరానున్నాయి. నీటి సౌకర్యం కల్పించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం

## చైర్‌పర్సన్ గోడిశెల సంధ్యా రాణి

**క్యాతన్‌పల్లి, మే 26, ప్రభాతవార్త**



మున్సిపాలిటీ లోని 22 వార్డుల ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రతకు పాలకవర్గం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చైర్ పర్సన్ డాక్టర్ గోడిశేల సంధ్యా రాణి అన్నారు. మంగళవారం ఒకటో వార్డులో ఉన్న ఈద్గాను కౌన్సిలర్‌లు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఈద్గా వద్దకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముండటంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈద్గా పరిసర ప్రాంతాల్లో చెత్త తొలగింపు, తాగునీటి సౌకర్యం, వీధి దీపాల నిర్వహణ వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పండుగ రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ వాతావరణానికి అనుగుణంగా అన్ని శాఖల సమన్వయంతో మున్సిపాలిటీ తరఫున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ కౌడగొని సాంబయ్య, 6వ వార్డు కౌన్సిలర్ మద్దెల శంకర్, 14వ వార్డు కౌన్సిలర్ కొప్పి రాజశేఖర్, సానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ

**ఆసిఫాబాద్, మే 26, ప్రభాతవార్త :**



వాంకిడి మండలం బంబారా గ్రామానికి చెందిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జాడి బాపూరావు సోమవారం రెబ్బెన మండలం పులికుంట వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం మృతుడి స్వగ్రామమైన బాంబారలో ఆయన భౌతిక కాయానికి జిల్లా ఎస్పీ నితికా పంత్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. అంత్య క్రియల నిమిత్తం తక్షణ సాయం కింద రూ. 30 వేలు వారి కుటుంబ సభ్యులకు అందించి ధైర్యంగా ఉండాలని భరోసనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయ శంకర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు వేణుగోపాల్, శ్రీనివాస్, వామన మూర్తి, సంజయ్, సబ్ ఇన్స్పెక్టర్స్ వెంకటకృష్ణ, మహేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అపోహలు, వదంతులు నమ్మవద్దు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మే 26, ప్రభాతవార్త**



వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు అసత్య ఆరోపణలతో కలిగించే అపోహలు, వదంతులను రైతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత, కొనుగోళ్ళలో పూర్తిస్థాయి నిలిచిపోయిన పరిస్థితి లేదని, అవసరానికి అనుగుణంగా లారీలు, హమాలీలు, గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలో దాదాపు 1 లక్ష 50 వేల నుండి 1 లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుండగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు 1 లక్ష 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను 10 నుండి 12 రోజులలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళుతున్నామని, గతంతో పోలిస్తే ఈసారి కొనుగోలు, రవాణా ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, పౌరసరఫరాలు, ఎస్.డబ్ల్యూ.సి. శాఖల అధికారులు నిరంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కట్టుబడి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రైతులను కోరారు.

# ఎస్‌పీఎం గేటు ముందు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**కాగజ్‌నగర్ రూరల్, మే 26, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీయం) గేటు ముందు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 7వ రోజుకు చేరుకున్నాయి. సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ నుండి నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘం రిజిస్ట్రేషన్ నెంబర్ ఇ-2381 కార్యనిర్వాహక అధ్యక్షుడు గోలెం వెంకటేశం మాట్లాడుతూ, సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మికులపై శ్రమ దోపిడీ జరుగుతోందని, స్థానిక కార్మికులకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఆరోపించారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎస్‌పీఎం యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అలాగే జేకే యాజమాన్యం కార్మికుల సమస్యలను అర్థం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 7వ రోజు రిలే నిరాహార దీక్షలో గోలెం వెంకటేశం (ఇ-2381), గోగర్ల రాములు (ఇ-2735), సి. వెంకటేష్ (ఇ-53), ఏకే సింగ్ (ఇ-2381), అబ్దుల్ నబీ (ఇ-2510), మంద్రజుల శంకర్ (ఎస్పీయం కార్మికులు) పాల్గొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# జనభాగీదారి అభియాన్ విజయవంతం

## ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి జిల్లాలో విస్తృత కార్యక్రమాలు

## 241 గ్రామాల్లో అవగాహన, ఆరోగ్య శిబిరాలు

**కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 26, ప్రభాతవార్త:**



జిల్లాలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన జనభాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి లక్ష ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసినట్లు వెల్లడించారు. జిల్లా పాలనాధికారి హరిత, ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు పర్యవేక్షణలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని జన్మన్, జుగా పథకాల కింద గుర్తించిన 241 గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి, గిరిజన సంక్షేమం మరియు అభివృద్ధి పథకాలపై ప్రజలకు సమగ్ర సమాచారం అందించారు. ఈ సందర్భంగా 341 గ్రామ సభలు, 241 అవగాహన ర్యాలీలు నిర్వహించి గిరిజన గూడాల్లో చైతన్యం తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, గిరిజన సంక్షేమ శాఖ ఏటిడివోలు, పీఎంఆర్సీ సిబ్బంది, ఏసీఎంఓలు, ఎస్సీఆర్పీలు సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఇక ఆరోగ్య పరంగా జిల్లాలోని 241 గ్రామాల్లో 168 ఆరోగ్య శిబిరాలు నిర్వహించి సికిల్ సెల్, టిబి, డయాబెటిస్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. గిరిజనుల ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి అవసరమైన వైద్య సేవలను అందించారు .అదేవిధంగా 1080 మంది లబ్ధిదారులకు జాబ్ కార్డులు, ఆధార్ సేవలు కల్పించారు. ఐఈసీ ప్రచార కార్యక్రమాలు, ట్రాన్సెక్ట్ వాక్‌లు, జనసున్వాయి కార్యక్రమాలు కూడా విజయవంతంగా నిర్వహించారు. ఆధార్ నవీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం, రేషన్ కార్డుల సమస్యలపై ప్రత్యేక సమీక్ష చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరిజన పిల్లల్లో చాలామందికి జనన ధృవీకరణ పత్రాలు లేవని గుర్తించిన అధికారులు, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి తెలిపారు.